ప్రజాశక్తి
ఆదివారం 4 జూన్ 2023
5
అనంతపురం

ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులతో కలిసి పరిశీలించారు. మొత్తం 522 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 402 మంది హాజరయ్యారు. 120 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 77 శాతం మంది హాజరయ్యారు. పరీక్షలు సజావుగా ముగియడంతో సంతోషం వ్యక్తం చేశారు.

జెఎన్‌టియులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

జెవివి విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజాభివృద్ధి

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజం అభివద్ధి జరుగుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో జెవివి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే సైన్స్ వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రంగన్న అధ్యక్షతన శిక్షణ తరగతులు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాలను నమ్మరాదన్నారు. సైన్సు నిరంతరం మార్పును ఆహ్వానిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. ప్రజలు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక దోహదపడుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ మానవాళికి తిండి, బట్ట నీడ అవసరమన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జెవివి నాయకులు నోటిలో నిప్పు పెట్టుకోవడంతో పాటు పలు అంశాలను శాస్త్రీయంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శులు మురళీధర్, ఎన్.మహేంద్ర రెడ్డి, స్థానిక నాయకులు ఎ.రామాంజనేయులు, పి.వెంకటరామిరెడ్డి, శ్రీధర్‌గౌడ్, దేశాయి నాగరాజు, శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.వెంకటేశ్వర్లు రెడ్డి పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ సరఫరాలో అదనపు డబ్బులు వసూలు చేస్తే చర్యలు

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్యాస్ సిలిండర్‌ను ఇంటికి సరఫరా చేయడానికి అదనపు డబ్బులు వసూలు చేస్తే డీలర్ల గుర్తింపు రద్దు చేస్తామని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీ మేరకు శనివారం సాయంత్రం అనంతపురం నగరంలోని నరసింహ గ్యాస్ ఏజెన్సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతపురం రూరల్ పరిధిలోని కురుగుంట గ్రామంలో ఉన్న నరసింహ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌నూ పరిశీలించారు. గ్యాస్ సిలిండర్‌ని ఇంటికి సరఫరా చేసే సమయంలో డెలివరీ బాయ్స్ డబ్బులు తీసుకుంటే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డెలివరీ బాయ్స్ చేసే తప్పిదాలకు పూర్తి బాధ్యత సంబంధిత గ్యాస్ ఏజెన్సీ వారిదేనన్నారు. గ్యాస్ ఏజెన్సీ నుంచి 15 కిలోమీటర్ల వరకు గల గృహాలకు ఉచితంగానే గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను ప్రతి గ్యాస్ ఏజెన్సీ వారు విధిగా పాటించాలని, అలాలేని పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్లు ప్రశాంత్ కుమార్, కుశాల్ జైన్ పాల్గొన్నారు.

ఇక్బాల్‌ను తప్పిస్తున్నారా..?

◆ తెరపైకి కొత్త పేరు ◆ ఇక్బాల్ కోసం వైసిపి మైనార్టీల పట్టు ◆ ఆయనకే ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హిందూపురం వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తారా.? అన్నది ప్రస్తుతం రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. నియోజకవర్గం పరిధిలోని మైనార్టీ నేతలు ఇక్బాల్ పేరును ఖరారు చేయాలని డిమాండ్ చేస్తూ మీడియా సమావేశాలు, ప్రదర్శనలకు దిగేందుకు సైతం సిద్ధపడటం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించిన సమయంలో ఐపిఎస్ అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన మహమ్మద్ ఇక్బాల్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. టిడిపి కంచుకోట అయిన హిందూపురంలో అది కూడా నందమూరి బాలకృష్ణపైన పోటీకి దింపడం అప్పుడు చర్చనీయాంశం అయ్యింది. కర్నూలు వాస్తవ్యులైన ఇక్బాల్‌ను అనూహ్యంగా ఇక్కడికి ఎందుకు దింపారన్నది కూడా రాజకీయవర్గాల్లో చర్చ జోరుగా సాగింది. రాష్ట్రమంతా వైసిపి 2019 ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసినా టిడిపి మాత్రం హిందూపురం స్థానాన్ని నిలబెట్టుకుని కంచుకోట అన్న పదాన్ని పదిలం చేసుకుంది. ఎన్నికలు అయిన వెంటనే ఇక్బాల్‌ను ఎమ్మెల్సీగా వైసిపి అధిష్టానం ప్రకటించింది. వచ్చే ఎన్నికలకు అంటే 2024 ఎన్నికల్లోపు ఆయన అక్కడి ఉండి రాజకీయంగా వైసిపిని బలోపేతం చేసే బాధ్యతను అప్పగించింది. అప్పటి నుంచి ఆయన హిందూపురం నియోజకవర్గంలోనే ఉంటూ పార్టీ కోసం కృషి చేస్తూ వస్తున్నారు. అయితే అక్కడున్న కొందరు స్థానిక నేతల మధ్య ఇక్బాల్‌కు సరైన సఖ్యత కుదరలేదు. దీంతో పలుమార్లు ఆ నేతల మధ్య మాటల యుద్ధాలు సాగాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గం పరిధిలో వైసిపి ముఖ్యనేత రామకృష్ణారెడ్డి హత్యకు గురయ్యారు. దీనికి ఇక్బాలే కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే ఆయన తనకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో విభేదాలు తారా స్థాయికి చేరాయి. ఈ తరుణంలో ఇటీవలే రాష్ట్ర రాజధానికి అధిష్టానం ఇక్బాల్‌ను పిలిపించి మాట్లాడినట్టు రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ సమావేశం అనంతరం ఆయన్ను నియోజకవర్గం బాధ్యతల నుంచి తప్పిస్తున్నారన్న సంకేతాలను ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన హైదరాబాద్‌లో కొంతమంది ఇతర పార్టీలకు చెందిన మైనార్టీ నేతలతోనూ మంతనాలు జరిపినట్టు ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో మైనార్టీల సంఖ్య గణనీయంగానే ఉంది. మైనార్టీలు ఆయనకు మద్దతునిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన పేరును ఖరారు చేయాలని మీడియా సమావేశాలు పెట్టడమే కాకుండా ఇతర రూపాల్లోనూ ఆయన తన బలాన్ని ప్రదర్శించేందుకు సిద్ధపడినట్టు తెలుస్తోంది. బల ప్రదర్శనకు సైతం దిగుతున్నట్టు ప్రచారం సాగుతోంది.

తెరపైకి కొత్త నేతలు

ఇక్బాల్ పరిస్థితి ఇలా ఉంటేయ హిందూపురం వైసిపిలో కొత్త నాయకులను బరిలో దింపేందుకు సమయత్తమైనట్టు ప్రచారం సాగుతోంది. దీప్తిరెడ్డి అనే మహిళా నాయకురాలికి ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించే యోచనలో నున్నట్టు వైసిపి వర్గాల్లో చర్చ సాగుతోంది. కొత్త వారిని దింపడం ద్వారా పార్టీలో ఇప్పుడు నెలకొన్న పరిస్థితులను కొంత వరకు చక్కబెట్టే ఆలోచనలో అధిష్టానమున్నట్టు తెలుస్తోంది. ఇక్బాల్‌ను వ్యతిరేకిస్తున్న వారిలో ఒక బలమైన సామాజిక తరగతికి చెందిన వారున్నారు. వారు ఈయన కాకుండా మరొకరును నియమిస్తే కలిసకట్టుగా పనిచేసేందుకు సిద్ధమన్నట్టు అధిష్టానానికి చెప్పిన నేపథ్యంలో ఆయన బలమైన సామాజిక తరగతికి, బిసి తరగతి రెండు కలిసొచ్చే విధంగా దీప్తిరెడ్డిని తీసుకొచ్చేందుకు అధిష్టానం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక్బాల్ మాత్రం ఈసారి ఎలాగైనా బరిలో నిలవాలని భావిస్తున్నారు. ఆ మేరకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. నేతల మద్దతు కూడగట్టే ప్రయత్నమూ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్టానం ఎటువంటి వైపు మొగ్గుచూపుతుందో వేచి చూడాల్సి ఉంది.

ఇక్బాల్‌కే ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం అసెంబ్లీ టికెట్‌ను ఎమ్మెల్సీ, నియోజక వర్గ ఇన్‌ఛార్జి షేక్ మహమ్మద్ ఇక్బాల్‌కు కేటాయించాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం దాదాపు 300 మంది ఆటో డ్రైవర్లు ఆయనకు మద్దతుగా పట్టణంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఇక్బాల్ నాయకత్వం వర్ధిల్లాలి.. జయహో ఇక్బాల్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్నారు. దీనికి తోడు అన్ని వర్గాల వారిని కలుపుకుని ముందుకుపోతున్న ఇక్బాల్‌కు టికెట్ ఇవ్వాలని కోరారు. వేరొకరికి ఇస్తే ముస్లిం మైనార్టీలు పని చేయరని హెచ్చరించారు.

చిలమత్తూరు : హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను ప్రకటించాలని మండలంలోని వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 4 ఏళ్లుగా అందుబాటులో ఉండి సేవలు చేస్తూ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన ఇక్బాల్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా కేటాయిస్తే టిడిపి కంచుకోటగా పేరొందిన హిందూపురంలో వైసిపి జెండా ఎగరవేస్తామన్నారు. హైకమాండ్ సరికొత్త ప్రయోగాలు చేస్తే పార్టీకి నష్టం తప్పదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, జడ్పీటీసి అనూషా, చిలమత్తూరు సర్పంచి సంధ్య, ఎంపిటిసి జగన్ మోహన్ రెడ్డి, వైస్ ఎంపిపి బయప్ప, పలువురు సర్పంచిలు, ఎంపిటిసిలు వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంలో ఇక్బాల్‌కు మద్దతు జరుగుతున్న ఆటో ర్యాలీ

అధికారుల నిర్లక్ష్యానికి జరిమానా..!

కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బందికి అపరాధ రుసుం విధింపు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్‌లో రెవెన్యూ సిబ్బందికి జరిమానా శిక్ష పడింది. ప్రభుత్వ నిబంధనలు మేరకు నిర్ణీత గడువులోగా టైటిల్ బదిలీ పన్ను విధింపు, ఇతర అంశాలపై సరైన చర్యలు చేపట్టనందుకు రెవెన్యూ విభాగ సిబ్బందికి అపరాధ రుసుం విధిస్తూ శనివారం నాడు కమిషనర్ రమణారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల మేరకు పన్ను చెల్లింపుదారుడు, గృహ కొనుగోలుదారులు దరఖాస్తు చేసిన 15 రోజుల్లోగా తగు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఆన్లైన్లో నిర్ణీత గడువు దాటిన తర్వాత పెండింగ్‌లో ఉంటే దానిని బియాండ్ ఎస్ఎల్ఏగా పేర్కొంటారు. ఇలా కార్పొరేషన్ పరిధిలో రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్న వాటిని గుర్తించి కమిషనర్ అపరాధ రుసుం విధించారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజేంద్రప్రసాద్ బాబు ఖాతాలో 133 రోజులుగా పెండింగ్‌లో దరఖాస్తు ఉన్నందున రోజుకు 50 రూపాయల వంతున రూ.6,650 అపరాధ రుసుం విధించారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ పి.వేణుగోపాల్ ఖాతాలో 38 రోజులుగా పెండింగ్‌లో ఉన్నందున రూ.1900, బిల్ కలెక్టర్ కె.హర్షవర్ధన్ రెడ్డి ఆన్‌లైన్ ఐడిలో 25 రోజులుగా పరిష్కారానికి నోచుకోని దరఖాస్తుపై రూ.1250, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మురళీమోహన్ అకౌంట్లో 15 రోజులుగా పెండింగ్‌లో ఉన్నందున రూ.750, బిల్‌కలెక్టర్ సి.ద్రపసాద్ ఐడిలో దరఖాస్తు పది రోజులకుపైగా పరిష్కారానికి నోచుకోనందున రూ.500, మరో బిల్ కలెక్టర్ సి.నారాయణస్వామి ఖాతాలో నాలుగు రోజులకుపైగా ఉన్న దరఖాస్తు పరిష్కారానికి నోచుకోనందున రూ.200, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఎ.పద్మలత అకౌంట్లో ఎనిమిది రోజులకు పైగా దరఖాస్తు నిర్ణీత గడువు ముగిసిన పరిష్కారానికి నోచుకోనందున రూ.400 ప్రకారం వీరందరికీ జరిమానా విధించారు. వీరి నుంచి ఈ అపరాధ రుసుంను జూన్ నెలలో వారి జీతాలు నుంచి రికవరీ చేసేలా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

కమిషనర్ రమణారెడ్డి అదనపు కమిషనర్‌గా రెవెన్యూ విభాగపు బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. ఆయన త్వరగా ఫైళ్లను అప్రూవల్ చేయకుండా పెండింగ్‌లో ఉంచటం వల్ల చాలా వరకు బియాండ్‌లోకి వెళ్తున్నాయని కింది సిబ్బంది గుసగుసలాడుతున్నారు. మాన్యువల్ రికార్డ్స్‌పై సంతకాలు చేసినా ఆన్‌లైన్‌లో త్వరితగతిన పరిష్కారానికి నోచుకోకపోవడం జాప్యానికి కారణంగా తెలుస్తోంది. ఏదో ఒక కారణంతో చేత పెండింగ్లో ఉంచటం వల్ల దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేకపోతున్నాయి. దీనికి తోడు పన్నుల వసూళ్లకు సంబంధించి రాజకీయ ఒత్తిళ్లు, సిఫారసులు తీసుకురావడం వల్ల చాలా వరకు అర్జీలు గడువులోగా పరిష్కారానికి నోచుకోక బియాండ్ ఎస్ఎల్ఏగా పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం తమను మాత్రమే బాధ్యులను చేసి జరిమానా విధించడం సరికాదని కార్పొరేషన్ రెవెన్యూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. బియాండ్ ఎస్-ఎల్ఏలో ఎందుకు ఉన్నాయన్న దానిపై పూర్తి స్థాయి పరిశీలన చేయాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

రైలు ప్రమాద మృతులకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఒడిశా రాష్ట్రంలో చోటు చేసుకున్న రైలు ప్రమాద మృతులకు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ మూడు రైళ్లు ఢీకొని వందలాది మంది ప్రయాణికులు మరణించడం బాధాకరమన్నారు. వీరికితోడు వేలమంది క్షతగాత్రులు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా నరేంద్ర మోదీ ప్రభుత్వం రైల్వే పట్ల, రైల్వే ప్రయాణికుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రైల్వేలో కొన్ని శాఖలు ప్రయివేట్ పరం చేయడంతోనే ఈ సంఘటన జరిగిందన్నారు. వందే భారత్ రైలును ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వం మిగిలిన రైల్వేను నిర్వీర్యం చేసిందన్నారు. రైల్వే ప్రమాదాలు జరగకుండా వేల కోట్ల రూపాయలతో ప్రారంభించిన భారత్ కా కవచ్ ఏమైపోయిందని ప్రశ్నించారు. ఒకే పేరు కలిగిన రైలుకు వందల సార్లు కేవలం జెండా ఊపడం కోసమే వందల కోట్ల రూపాయలను ఖర్చు పెట్టడం కాదని హితవు పలికారు. ఈ ప్రమాదానికి నరేంద్ర మోదీనే పూర్తిగా నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైలు ప్రమాదంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయించాలని, రైలు ప్రమాదంలో మరణించిన వారికి ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు ముస్కీన్, వెంకట నారాయణ, వలీ, ప్రకాష్, మసూద్, రాజు, ఎన్టీఆర్ సీనా, గఫూర్, లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, ఎస్కే మహమ్మద్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

విజయోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, ఎస్పీ శ్రీనివాసులు

నేడు కళ్యాణదుర్గంలో విజయోత్సవ సభ

కళ్యాణదుర్గం : ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా తలపెట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంతోపాటు జగనన్న ప్రభుత్వం నాలుగేళ్ల పాలన పూర్తి చేసిన సందర్భంగా ఏర్పాటు చేయనున్న విజయోత్సవ సభను జయప్రదం చేయాలని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని కుందుర్పి రోడ్డులో ఆదివారం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయం సిఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. గడప గడపకూ తాము వెళ్లినప్పుడు సంక్షేమ ప్రజల కళ్లల్లో కనిపిస్తోందన్నారు. కావున విజయోత్సవ సభలో జిల్లావ్యాప్తంగా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాగా విజయోత్సవ సభ ఏర్పాట్లను ఎస్పీ కె.శ్రీనివాసులు పరిశీలించారు. ఇందులో భాగంగా సభా ప్రాంగణం, భోజన స్టాల్స్ తదితర ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

శరవేగంగా అంతర్గత రహదారుల పనులు : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని లక్ష్మీనగర్ నాగుల కట్ట వద్ద రూ.1.41కోట్లతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులను మేయర్ మహమ్మద్ వసీం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సిఎం జగన్ సహకారంతో నగరంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రహదారులు, డ్రెయినేజీలు, కల్వర్టుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. అంతేకాకుండా నగర చరిత్రలోనే తొలిసారిగా నగరాభివృద్ధికి స్పెషల్ గ్రాంట్ రూ.25కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే స్పెషల్ గ్రాంట్ రూ.25 కోట్లు పనులకు టెండర్ల పక్రియ పూర్తయిందని త్వరితగతిన పనులు పూర్తి చేస్తామన్నారు. నగరంలో శరవేగంగా అంతర్గత రహదారుల విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకుంట మధు, ఖాజా, డిఇలు చంద్రశేఖర్, రాంప్రసాద్‌రెడ్డి, ఎఇ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

నిబంధనలను అనుసరించి విధులు నిర్వహించండి : కమిషనర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

జాబ్‌చార్ట్‌ను అనుసరించి శానిటేషన్ కార్యదర్శులు పని చేయాలని కమిషనర్ జి.రమణారెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో పారిశుధ్య కార్యదర్శులు, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ముందుగా రెండు రోజుల నుంచి శానిటేషన్ మస్టర్ పాయింట్లకు హాజరుకాని సచివాలయా శానిటేషన్ కార్యదర్శులకు మెమోలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యదర్శి ప్రభుత్వం నిర్దేశించిన ప్రధాన విధుల జాబితాను కచ్చితంగా పాటించాలని సూచించారు, ముఖ్యంగా కార్యదర్శులు తమ వార్డుల్లో ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. అలాగే ప్రతి దుకాణం వద్ద డస్ట్‌బిన్‌లు ఉండేలా చూడాలన్నారు. డ్రెయిన్లు, కాలువల్లో క్రమం తప్పకుండా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. డివిజను పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఇకపోతే యూజర్ ఛార్జీల వసూళ్లను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, ప్రజారోగ్యాధికారి గంగాధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు ఉపాధ్యాయులు సస్పెన్షన్

అనంతపురంసిటీ : గార్లదిన్నె మండలం పెనకచర్ల ఎంపీపీఎస్ మెయిన్ స్కూల్ ఎస్‌జిటి టీచర్ జి. లక్ష్మీదేవి, పామిడి మండలం ఓబులాపురం గ్రామం ఎంపిపిఎస్ పి.రోజామేరీ, గుత్తి 9వ వార్డు ఎంపీపీఎస్ హెచ్‌ఎం కంబగిరి రాముడు, గుత్తిలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న ఎంపీపీఎస్ ఎస్‌జిటి టీచర్ నూరునిషాలను సస్పెన్షన్ చేస్తూ అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నాడు-నేడు రెండో విడత పనులకు డబ్బులు మంజూరు చేసినప్పటికీ పనులు చేయకుండా నిర్లక్ష్యం చేసినందుకు సస్పెన్షన్ చేసినట్లు చెప్పారు.

సైకిల్ ర్యాలీ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ ఆధ్వర్యంలో శనివారం నగరంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ట్రైనీ కలెక్టర్ కుశాల్‌జైన్ ప్రారంభించారు. కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ సప్తగిరి సర్కిల్ కూడలి మీదుగా టవర్‌క్లాక్ వరకూ వెళ్లి తిరిగి కళాశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ సైకిల్ తొక్కటం అనేది ఆరోగ్యానికి చాలా మంచిది అన్నారు. అంతేగాకుండా శారీరక పటుత్వం లభిస్తుందన్నారు. అలాగే పర్యావరణానికి మనమంతా ఎంతో మేలు చేసిన వారం అవుతామన్నారు. జిల్లా వైద్య అధికారి డాక్టర్ వీరబ్బాయి మాట్లాడుతూ సైకిల్ తొక్కడం దినచర్యలో ఒక భాగంగా అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్-ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రభాకర్‌రాజు, కళాశాల కరస్పాండెంట్ పిఎల్ఎన్.రెడ్డి, అధ్యాపకులు ఎన్.ఓబుల్‌రెడ్డి, డాక్టర్ మధుసూదన, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఓ యుగంధర్, పిఓఎన్‌సిడి నారాయణస్వామి, డిఇ ఎంఒ భారతి, డిప్యూటీ డిఇ ఎంఒ త్యాగరాజు, ఎన్‌సిడి స్టాఫ్ ఆంజనేయులు, శ్రీరామ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రైనీ కలెక్టర్ కుశాల్‌జైన్

పెద్దపప్పూరు : సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.ఉషారాణి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 2017 జాతీయ అసంక్రామిత వ్యాధుల పర్యవేక్షణ సర్వే ప్రకారం 41.3 శాతం భారతీయులు శరీరక శ్రమకు దూరంగా ఉన్నారని తేలిందన్నారు. దీనివల్ల గుండె సంబంధ, రక్తపోటు, షుగర్, క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయన్నారు. ఇందుకు కారణం జీవన శైలిలో చాలా మార్పులు రావడం, శరీరక శ్రమ తగ్గిపోవడం, పొగాకు వాడటం, ఆల్కహాల్ తాగడం, గాలి కాలుష్యం, సరియైన ఆహారం తీసుకోకపోవడం ప్రధాన కారణాలు అన్నారు. కావున ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో షర్మస్‌వలి, లక్ష్మీకుమారి, నాగరత్నాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ప్రమాద ఘటనపై ప్రత్యేక హెల్ప్‌డెస్క్

అనంతపురం క్రైం : రైలు ప్రమాద ఘటన నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కె.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిస్సా రాష్ట్రం బాలాసోర్ సమీపంలో శుక్రవారం జరిగిన రైలు ప్రమాదంలో జిల్లా వాసులు ఎవరైనా చిక్కుకుని ఉంటే వారి సహాయార్థం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల సౌలభ్యం కోసం ఈ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అవసరమైన వారు అనంతపురం పోలీసు కంట్రోల్ రూమ్ 08554 240241, అనంతపురం జిల్లా అదనపు ఎస్పీ సెల్.94407 96801 నెబర్లలో సంప్రదించాలని కోరారు.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలోని మహాత్మ జ్యోతిరావు పూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాలలోని ఇంగ్లీష్ మీడియంలో 2023-24 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడితన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల కన్వీనర్, ప్రిన్సిపల్ పిఎంకె.సంగీతకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బాలికలకు నార్పల, డీ.హీరేహాల్, గోనబావి, బాలురకు కుందుర్పి, కొనకొండ్ల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 6, 7, 8, 9వ తరగతిలోని వివిధ కేటగిరీలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 5 నుంచి 12వ తేదీలోపు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష జూన్ 20న దరఖాస్తు చేసుకున్న పాఠశాలల్లో ఉంటుందన్నారు. వివరాలకు ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్ నెంబర్లకు సంప్రదించి తెలుసుకోవాలన్నారు. నార్పల-90008 61117, గోనబావి-83094 83104, డీ.హీరేహాల్-78933 06450, కొనకొండ్ల-94905 000 15, కుందుర్పి-63092 92018 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఒడిస్సా రైలు ప్రమాద మృతులకు నివాళి

ఆత్మకూరు : ఒడిస్సా రైలు ప్రమాద ఘటన మృతులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాళులర్పించారు. ఇందులో భాగంగా శనివారం ఎమ్మెల్యే స్వగ్రామం తోపుదుర్తిలోని స్వగ్రామంలో స్థానిక వైసిపి నాయకులతో కలిసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైలు ప్రమాదంలో సుమారు 280 మందికిపైగా చనిపోవడంపై తీవ్రంగా కలచివేచిందన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

'ముందస్తు' హడావుడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాజకీయ నేతల్లో ముందస్తు హడావుడి కనిపిస్తోంది. సాధారణంగా 2024 సంవత్సరంలో సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉంది. కాని కొద్దిగా ముందుగానే వైసిపి ప్రభుత్వం ఎన్నికలకు వెలుతుందన్న ప్రచారం సాగుతోంది. ఈనేపథ్యంలో అభ్యర్థులు ముందుగానే తమ స్థానాలను పదిలం చేసుకునేందుకు సమయత్తమవుతున్నారు. నియోజకవర్గాల్లో బలప్రదర్శనలతోపాటు, పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలకు సన్నద్ధమవుతున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది ఆఖరు సంవత్సరం కావడంతో నేతల్లోనూ ఎన్నికల హడావుడి కనిపిస్తోంది. ప్రధానంగా అధికారపార్టీలో ఇది అధికంగా కనిపిస్తోంది. తమ కాలంలో చేపట్టిన అభివృద్ధిని చూపించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా అనంతపురం నియోజకవర్గంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పెద్దఎత్తున తమ అభివృద్ధిగా చెప్పుకునేందుకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఈ వారంలో ప్రారంభించారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల పూర్తయిన రోజునే దీన్ని పార్టీ పరంగానే ప్రారంభించి పెద్దఎత్తున వైసిపి నాయకులను, కార్యకర్తలతో సందడి చేశారు. ఇంకా పెద్దఎత్తున అభివృద్ధి తమ హయంలో చేపట్టామని నియోజకవర్గ ప్రజలకు తెలియజేసే విధంగా ప్లాన్ చేశారు. ఇక మంత్రి ఉషచరణ్ శ్రీకి కూడా తమ నాలుగేళ్ల పాలనలో పెద్దఎత్తున అభివృద్ధి చేసామని చాటి చెప్పడమే కాకుండా తనకు నియోజకవర్గంలోనున్న పట్టును బలప్రదర్శన ద్వారా చాటి చెప్పేందుకు పెద్దఎత్తున జనసమీకరణకు సిద్ధపడ్డారు. ఆదివారం నాడు భారీ ప్రదర్శనకు సమయత్తమయ్యారు. ఇక తాడిపత్రి నియోజకవర్గంలో అక్కడి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఏడాది కిందటి నుంచి నియోజకవర్గంలో పాదయాత్ర చేపడుతున్నారు. తాజాగా తాడిపత్రి మండలంలోనూ పాదయాత్రను ముగించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ ఇంఛార్జీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా హాజరయ్యారు. పుట్టపర్తి నియోజకవర్గంలోనూ శ్రీధర్‌రెడ్డి , రాయదుర్గంలో కాపు రామచంద్రారెడ్డి కూడా నాలుగేళ్ల అభివృద్ధిపై ప్రచారం చేసుకునే పని చేపట్టారు. ఇలా ఒక్కొక్క చోట అధికారపార్టీ నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటున్నారు. ఇక ప్రతిపక్ష టిడిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ ప్రచారం చేపడుతోంది. ఈ సందర్భంగా అధికార వైసిపి, టిడిపి నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం తదితర నియోజకవర్గాల్లో తీవ్ర స్థాయిలో విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. అన్నీ కలిపి రాజకీయ వేడిని రాజేస్తున్నాయి. నేతల ఇళ్ల వద్ద కూడా అప్పుడే రాజకీయ సందడి కొనసాగుతోంది. ఈ క్రమంలో అధికారుల బదిలీలు ఈవారంలో సాగుతున్నాయి. అధికారులు తమకు అనుకూలమైన వారిని నియమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దఎత్తున సిఫారసు లేఖల కోసం అదికారులు క్యూలు కడుతున్నారు. ఈ బదిలీలపైనా అనేక ఆరోపణలూ వస్తున్నాయి. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే కొంత మంది అధికారుల బదిలీలు కొనసాగుతున్నట్టు చర్చ సాగుతోంది. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు శాఖలు ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించేవి. కావున ఆ రెండు శాఖల్లోని వారిని ఇప్పుడు తమకు అనుకూలంగా ఉండేవారు ఎక్కడుండాలన్న దానిపైనా నాయకులు దృష్టి పెడుతున్నారు. వారిని ఆయ స్థానాల్లో నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తంగా చూసినప్పుడు అప్పుడే ఎన్నికల ఫీవర్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొదలైనట్టుగా కనిపిస్తోంది. నాయకులు వాటి కోసం ఇప్పటి నుంచే సమయత్తమవుతున్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

మృతిచెందిన బాలరాజు

పుట్లూరు : ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కోమటికుంట్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబీకుల సమాచారం మేరకు.. కోమటికుండ్ల గ్రామానికి చెందిన విఆర్ఎ బాల అంకన్న కుమారుడు బాలరాజు (30) తన పొలంలో ట్రాక్టర్‌తో పనులు చేసి తిరిగి వస్తుండగా అదుపు తప్పి కోమటికుంట్ల సమీపంలో ఉన్న చెరువులోకి దూసుకెళ్లింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న బాలరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. బాలరాజు నార్పల మండలం గూగూడు సచివాలయంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి కొడుకు, ఇద్దరు కూతుర్లు, భార్య ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడు ఆత్మహత్య

పెద్దవడుగూరు : మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన నరేంద్ర(25) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన నరేంద్ర ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద ఆరాతీశారు. ఎక్కడా కనిపించకపోవడంతో సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు నరేంద్ర వద్ద ఉన్న చరవాణి లోకేషన్ ఆధారంగా గుత్తి అనంతపురం సమీపంలో ఉన్న చింతవనంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఎస్ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకోవడంతో చెట్టుకు ఉరేసుకుని కనిపించారు. మృతికి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కాగా నరేంద్రకు మూడేళ్ల క్రితమే వివాహమైంది. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో ఎద్దులు మృతి

మృతిచెందిన ఎద్దులు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని రాతిబావి వంక గ్రామంలో రైతు గౌడ చెందిన రెండు ఎద్దులు విద్యుదాఘాతంతో మృతిచెందాయి. రోజువారి వ్యవసాయ పనుల్లో భాగంగా రైతు గౌడ శనివారం తెల్లవారుజామున ఎద్దుల బండితో వెళ్తుండగా దారిలో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో షాక్ గురై రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. దీంతో రైతు లబోదిబోమని వాపోయాడు. ఎద్దుల విలువ సుమారు రూ.1,40,000 ఉంటాయని, ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

భూమి మార్కెట్ విలువను సవరించాలని ధర్నా

ప్రజాశక్తి-గుత్తి

ధర్నా చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

భూములు, ఇళ్లస్థలాల మార్కెట్ విలువలను సవరించాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ప్రభుత్వం భూములు, ఇండ్ల స్థలాల మార్కెట్ విలువలు పెంచడంతో సామాన్యులు, వ్యాపారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అరకొరగా మార్కెట్ విలువలను పెంచేవారిని ఇప్పుడు ప్రభుత్వ అధికారులు ఏకంగా మూడు నుంచి ఐదు రెట్లు పెంచడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతేగాకుండా సామాన్యులు క్రయవిక్రయాలు చేయకపోవటంతో వ్యాపార లావాదేవీలు స్తంభించిపోయాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి మార్కెట్ విలువలను సవరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

'గడపగడపకూ మన ప్రభుత్వం'


మహిళకు కరపత్రం అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంరూరల్ : మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎంపిడిఒ కొండయ్య, వైసిపి నాయకులు ఉపేందర్‌రెడ్డి, మల్లాపురం చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, మెచ్చిరి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని దండువారిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఏడావులపర్తి, ఓబులాపురం గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ముఖ్య అతిథిగా హాజరై ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, జడ్పిటిసి భాస్కర్, బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి, జెసిఎస్ కన్వీనర్ భయపరెడ్డి, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ విజయభాస్కర్, ఎఒ శ్యాంసుందర్‌రెడ్డి, ఐకెపి ఎపిఎం మద్దిలేటి, హౌసింగ్ అధికారి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ఆలూరు రమణారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ

పశుబీమాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-బెలుగుప్ప

రికార్డులు పరిశీలిస్తున్న ప్రాంతీయ పశువైద్యశాల డాక్టర్ శ్రీనివాసగుప్తా

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వైఎస్ఆర్ పశు వైద్య బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కళ్యాణదుర్గం సహాయ సంచాలకులు పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ పశు వైద్యశాల డాక్టర్ ఎన్.శ్రీనివాస గుప్తా సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం, వెంకటాద్రిపల్లి పశువైద్య కేంద్రాలతోపాటు సీర్పి రైతు భరోసా కేంద్రాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ పశు బీమా చేసుకుంటే పశువుల మరణాల ద్వారా వచ్చే నష్టాన్ని నివారించుకోవచ్చన్నారు. కావున పశు సంవర్ధక శాఖ సిబ్బంది బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే దాణామృతం కూడా అందుబాటులో ఉందని కావాల్సిన రైతులు తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్, వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సిబిఎస్ఇ 'పది' ఫలితాల్లో 'సంసిధ్' హవా

ప్రజాశక్తి-అనంతపురం

ప్రధానోపాధాయురాలు శ్రీవాణి

సిబిఎస్ఇ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

సిబిఎస్ఇ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నగర సమీపంలోని రాచానపల్లి సమీపంలో ఉన్న సంసిధ్ సెయింట్ జోసెఫ్ పాఠశాల ప్రభంజనం సృష్టించింది. పరీక్షలకు 48 విద్యార్థులు హాజరవగా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాసంస్థల ఛైర్మన్ వాస శ్రీనివాసరావు, ప్రధానోపాధాయురాలు శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన కృష్ణభగవాన్‌రెడ్డి (600/531), తరుణ్‌తేజ్‌రెడ్డి 529, రిషికాంత్‌రెడ్డి 524, ప్రభాస్‌రెడ్డి 516, నందిత 515 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. అనతికాలంలోనే సంసిధ్ సెయింట్ జోసెఫ్ సీబీఎస్ఈ పాఠశాల అనంత ప్రజల ఆదరణను చూరగొందని తెలిపారు. విశాలమైన ప్రకృతి వాతావరణంలో నాణ్యమైన విద్యా విలువలను అందించే సదుద్దేశంతో తమ సంస్థ తమ సిబ్బంది అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యా విలువలతో గొప్ప లక్ష్యాలను ఛేదించే విషయంలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. తమతోపాటు విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. 2023 - 24 విద్యా సంవత్సరంలోనూ సంసిధ్ సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు జిల్లా రాష్ట్రస్థాయిలో నిలిచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని డి.కొండాపురం గ్రామంలో రైతులకు మంజూరైన సబ్సిడీ వ్యవసాయ పనిముట్లను విప్ కాపు రామచంద్రారెడ్డి శనివారం పంపిణీ చేశారు. డి.కొండాపురం వాటర్‌షెడ్ ప్రాజెక్టులో భాగంగా వ్యవసాయ ఉత్పాదక పెంపుదల కోసం తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్లు, తదితర వ్యవసాయ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ ప్రాజెక్టు అధికారిణి శ్రీవిద్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో జగనన్న ఇళ్ల నిర్మాణానికి సర్పంచి సుగుణ వెంకటేష్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్లు నిర్మించేందుకు సిఎం జగన్ కంకణబద్ధులయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బాలాజీ, హౌసింగ్ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుత్తి ఎడిఎగా వెంకటరాముడు

గుత్తి : గుత్తి నూతన వ్యవసాయ సహాయ సంచాలకులుగా ఎం.వెంకటరాముడు శనివారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం ఎడిఎగా విధులు నిర్వహిస్తున్న వెంకటరాముడు బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న నారాయణనాయక్ కణేకల్ సీడ్ ఫాంకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ముస్తాక్‌అహ్మద్‌తో పాటు డివిజన్ పరిధిలోని 5 మండలాల ఏవోలు, ఎఇఒలు, సిబ్బంది స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎడిఎ మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి తోడ్పాటును అందిస్తానన్నారు. పంటలు సాగు చేసే సమయంలో రైతులకు మెలకువలు, తగిన సూచనలు ఇచ్చి అధిక దిగుబడులను సాధించేందుకు కృషి చేస్తానన్నారు.

కర్నాటక మంత్రి నాగేంద్రకు సన్మానం

ఉరవకొండ : బళ్లారి జిల్లా రూరల్ ఎమ్మెల్యే, మంత్రి బి.నాగేంద్రను జిల్లానాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. యువజన సాధికారత, క్రీడలు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా బళ్లారికి వెళ్తున్న సందర్భంగా శనివారం విడపనకల్లు మండలం కొట్టాలపల్లి గ్రామానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న విడపనకల్ వైస్ ఎంపిపి మోదుపల్లి సునీతారాణి, కొట్టాలపల్లి సర్పంచి లెజెండ్ మోదుపల్లి రామాంజనేయులు, తదితరులు గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం చేలగురికి ఎర్రితాత దేవస్థానంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బళ్లారికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బళ్లారి జిల్లా మాజీ మేయర్ మోదుపల్లి రాజేశ్వరి, జిల్లా నాయకులు సుబ్బారాయుడు, బాబు, లక్ష్మీ నారాయణ, కర్ణాటక కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదిలింగ, సిద్దన్న గౌడ్, మాళాపురం చిగరబంకల గోపీ, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీలు

మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ చిన్నతనంలోనే పెళ్లి చేయడం వల్ల సంతానం కలిగితే చాలా సమస్యలు ఎదురవుతాయన్నారు. కావున ప్రతి ఆడపిల్లకు 20 సంవత్సరాలు వచ్చిన తర్వాతే పెళ్లి చేయాలని సూచించారు. అప్పుడే వారికి అవగాహన ఉండి తమ పిల్లల భవిష్యత్తుకు మంచి పునాది వేసుకుంటారన్నారు. కావున ప్రతి ఒక్కరూ పిల్లలకు వయస్సు వచ్చిన తర్వాతనే పెళ్లిళ్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిసిసి సూపర్‌వైజర్ దస్తగిరమ్మ, తల్లిదండ్రులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నారసింహుడికి వెండి పూలహారం అందజేత

ప్రజాశక్తి-ఉరవకొండ

వెండి పూలహారాన్ని బహూకరిస్తున్న భక్తులు

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరవకొండ మండలం పెన్నహోబిలంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామికి కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకు చెందిన భక్తుడు శనివారం వెండి పులహారాన్ని బహూకరించారు. శంకరబండ పంచాయతీ తలమామిడి గ్రామానికి చెందిన భక్తుడు తలారి రామకృష్ణ రూ.19వేల విలువైన 210 గ్రాముల వెండితో తయారు చేయించిన పూలహారాన్ని ఆలయ కార్యనిర్వాహణ అధికారి విజయ్‌కుమార్, అర్చకులు ద్వారకానాథ్, మయూరం బాలాజీ స్వాములకు అందజేశారు. ఈ సందర్భంగా వెండి పూలహారాన్ని స్వామివారి మూలవిరాట్‌కు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది దాత రామకృష్ణను శాలువా కప్పి ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-ఉరవకొండ

లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వెంకటేష్‌నాయక్

మండల పరిధిలోని మోపిడి గ్రామంలో లింగనిర్ధారణ నిరోధక చట్టంపై రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆడపిల్లల సంఖ్య తగ్గిపోయి మగపిల్లల సంఖ్య పెరగడం వల్ల రాబోయే కాలంలో అనేక అనర్థాలు కలుగుతాయని సూచించారు. కొంతమంది మగపిల్లపై మోజుతో ఆడపిల్లలను వద్దనుకుని అబార్షన్లకు పాల్పడుతున్నారన్నారు. అబార్షన్ చేయించడం వల్ల ప్రాణాలకే ముప్పు కలుగుతుందన్నారు. అంతేగాకుండా చట్టానికి విరుద్ధంగా ఎవరైనా అబార్షన్లకు పాల్పడినా, చేసినా శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సిహెచ్ఒ నాగరంగయ్య, ఎఎన్ఎంలు హెబ్సియా, అనూషా, సిఒ భగవాన్‌దాస్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీమాపై అవగాహన కల్పించాలి : ఇఒఆర్‌డి

ప్రజాశక్తి-నార్పల

వైఎస్ఆర్ బీమా, ప్రధానమంత్రి బీమా యోజన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోనివెల్ఫేర్ అసిస్టెంట్లకు వైఎస్ఆర్ బీమా, ప్రధానమంత్రి బీమా యోజన పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తులు ఎవరైనా దురదృష్టవశాత్తు మరణించినా, అంగవైకల్యం సంభవించినా ఆ కుటుంబాలకు బీమా పథకాలు అందుతాయన్నారు. ఈ పథకానికి 1 నుంచి 70 సంవత్సరాల మధ్య ఉన్న వారందరూ ఈ పథకాలకు అర్హులన్నారు. అయితే 18 నుంచి 50 సంవత్సరాల మధ్య సహజంగా మరణిస్తే రూ.లక్ష, 18 నుండి 70 ఏళ్ల వయసులో ఉన్నవారు ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం సంభవించినా రూ.5లక్షల వరకూ కుటుంబానికి అందుతుందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

ప్రజాశక్తి-యాడికి

మహిళా పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ గంగయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కొత్త పోలీసుస్టేషన్‌లో మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల పరిధిలో మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉంటూ ఏ చిన్న ఘటన జరిగినా ఎప్పటికప్పుడు ఎస్ఐ, సిఐలకు సమాచారం అందజేయాలన్నారు. లాఅండ్‌ఆర్డర్ పరిరక్షణలో తమవంతు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా దిశా యాప్‌పై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

'గేట్స్'కు అటానమస్ గుర్తింపు

ప్రజాశక్తి-గుత్తి

గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల

గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు లభించింది. గేట్స్‌కళాశాలలో అధ్యాపకుల బోధన, విద్యార్థుల ప్రతిభ, అధ్యాపకేతర బందం, జెఎన్‌టియు అధ్యాపక బృందం తోడ్పాటును ఇవ్వడంతో అటానమస్ గుర్తింపు దక్కిందని కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథరెడ్డి తెలిపారు. నిర్వహణను గుర్తింపుగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కళాశాలకు అటానమస్ హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే విశ్వను కలిసిన తహాశీల్దార్

ప్రజాశక్తి-ఉరవకొండ

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి పూలమొక్కను అందజేస్తున్న తహాశీల్దార్ ఈరమ్మ

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విడపనకల్ తహాశీల్దార్ ఈరమ్మ శనివారం ఉరవకొండలోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విశ్వేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పెద్దవడుగూరు మండలం నుంచి బదిలీపై విడపనకల్ మండలానికి వచ్చిన సందర్భంగా గౌరవార్థం విశ్వేశ్వరరెడ్డిని కలిసినట్లు తహాశీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని కోరారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఘనంగా మహా కుంభాభిషేకం

ఆత్మకూరు : మండల కేంద్రంలో వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి స్వర్ణత్సవం సందర్భంగా కాశీ విశ్వనాథ హనుమత్సహిత సీతారామ లక్ష్మణ స్వామివార్ల మహా కుంభాభిషేకం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా గణపతి, నవగ్రహ పున: ప్రతిష్ట, చతుషష్టి కలార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు.

విద్యతోనే జ్ఞానసముపార్జన

అనంతపురం : నేటి ఆధునిక ప్రపంచంలో ప్రతి విద్యార్థికీ జ్ఞాన సముపార్జన అవసరమని శ్రీబాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె కృష్ణకిషోర్ సూచించారు. నగరంలోని పివికెకె డిగ్రీ, పీజీ కళాశాలల్లో శనివారం కళాశాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతికతను విజ్ఞానంతోపాటు తమలోని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.మునికృష్ణారెడ్డి, ట్రెజరర్ పల్లె సింధూరారెడ్డి, బాలాజీ డిఎడ్ కళాశాల ప్రిన్సిపల్ వీరప్రకాష్, ఎఒలు ధనుష్, ఉస్మాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

98-డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

రాయదుర్గం : 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నియోజకవర్గ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులు కోరారు. ఈమేరకు శనివారం పట్టణంలోని నివాసంలో విప్ కాపు రామచంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా పూలమాల వేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ దయతో తమకు ఉపాధ్యాయులుగా ఉద్యోగం లభించిందన్నారు. అయితే ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పొడిగించాలని, ఒక్కరోజు విరామంతో ఏడాదికి 12 నెలల వేతనం చెల్లించాలని, ఇప్పటికీ ఉపాధ్యాయ ఉత్తర్వులు అందని 1998 డిఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇందుకు విప్ కాపు స్పందిస్తూ సమస్యలను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : రిలయన్స్ డిజిటల్ పైన, 2వ ఫ్లోర్, సుభాష్‌రోడ్డు, క్లాక్‌టవర్ దగ్గర, అనంతపురం.
-వలీసాబ్ రోడ్, అరబిక్ రెస్టారెంట్ ఎదురు, కదిరి.
-లక్ష్మీబజార్, అనంతపురం మెయిన్‌రోడ్డు, ఎపిజిబి బ్యాంక్ దగ్గర,రాయదుర్గం.
- ఫస్ట్‌ఫ్లోర్, వాల్మీకి సర్కిల్, కళ్యాణదుర్గం.
-చలపతి ఎన్‌క్లేవ్, ఫస్ట్‌ఫ్లోర్, పరిగేల్ బస్టాప్ దగ్గర, హిందుపూర్

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26.06.2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2431.30 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798